ఇసుక కొరత.. నిర్మాణ రంగం కుదేలు

- ఎక్కడికక్కడ నిర్మాణాల నిలిపివేత
- ఉపాధి కోల్పోయిన తాపీమేస్త్రీలు, సహాయకులు
- ప్రభుత్వం స్పందించాలని కార్మికుల డిమాండ్

ఉంగుటూరు: ఇసుక దొరకక నిర్మాణ రంగం కుదేలైంది. డిమాండ్‌కు సరిపడా ఇసుక సరఫరా లేక ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేబ్రోలులోని పాయింట్ వద్ద 449 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. ఇది మట్టితో కలిసి ఉంది. నిర్మాణాలకు ఇక్కడి ఇసుక పని చేయని పరిస్థితి నెలకొంది. కేవలం పునాదుల్లో వేసుకునేందుకు మాత్రమే ఈ ఇసుక వాడుకోవడానికి పనికి వస్తుంది. దీంతో నిర్మాణానికి దూర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాయింట్‌లో ఇప్పటి వరకు 115 టన్నుల ఇసుక మాత్రమే ప్రభుత్వం విక్రయించగలిగింది. కొత్తగా ఇసుకను నిల్వ చేయలేదు. ముందు



చేబ్రోలులో ఉన్న ప్రభుత్వ ఇసుకపాయింటు వద్ద ఉన్న కొద్దిపాటి పనికిరాని ఇసుక

చూపుతో వ్యాపారులు కొందరు స్టాకు చేసిన ఇసుకను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేటులో పది టన్నుల ఇసుకకు రూ.14,100 వసూలు చేస్తున్నారు. ఇసుకను అధికంగా నిల్వ చేసిన వారిలో ఎక్కువ మంది అధికారపార్టీకి చెందిన వారే ఉన్నారు. దాంతో అధిక ధరలకు ఇసుకను విక్రయించి వారంతా జేబులు నింపుకుంటున్నారు. వారి వద్ద కూడా ఇసుక నిల్వలు తరిగిపోవడంతో పాటు అధిక ధరలు భరించలేని పేద మధ్య తరగతి ప్రజలు నిర్మాణాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నారు. ఈ ప్రభావం నిర్మాణ రంగంపై పడి కార్మికులకు ఉపాధి కరువైంది. చాలా చోట్ల నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపేశారు. ఇసుకను ప్రభుత్వం విరివిగా సరఫరా చేస్తేనే నిర్మాణాలు ప్రారంభమవుతాయని, కూటమి నాయకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నిర్మాణ రంగ కార్మికులు కోరుతున్నారు.

నిర్మాణాలు ఆగిపోయాయి



ఇసుక సరఫరా నిలిపివేయడం వల్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ఫలితంగా తాపీమేస్త్రీలు, సహాయకులకు పనులు లేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది. నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి దెబ్బతింది. అందరూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

– తవ్వాకుల రాంపండు, తాపీమేస్త్రీ, చేబ్రోలు

విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలి



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ అలివేలు

దెందులూరు: అజెండా ప్రకారం వ్యాయామ విద్యాబోధన, పర్యవేక్షణ జరగాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ అలివేలు అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో దెందులూరు మండల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటరీ అలివేలు మాట్లాడుతూ సెప్టెంబరులో నిర్వహించాల్సిన ఎస్‌జీఎఫ్ గేమ్స్ వివరాలు తెలిపారు. పీఈటీలు, పీడీలు విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభను వెలికితీసేందుకు నూరు శాతం కృషి చేయాలన్నారు. మండల స్పోర్ట్స్ సెక్రటరీ జక్కుల సురేష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్పోర్ట్స్ ఎప్పుడు నిర్వహిస్తామనేది అన్ని పాఠశాలల పీడీలు, పీఈటీలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో హెచ్‌ఎం డాక్టర్ ఎం.మనోహర్, మండలంలో పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సొసైటీ గోడౌన్ల తనిఖీ



గోపన్నపాలెం సొసైటీలో గోడౌన్లను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: అన్ని కోఆపరేటివ్ సొసైటీలు రికార్డుల నిర్వహణతో పాటు విధి నిర్వహణ సక్రమంగా ఉండాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి సూచించారు. మంగళవారం దెందులూరులో సోమవరప్పాడు, గాలాయగూడెం, జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ గోడౌన్లను ఆమె తనిఖీ చేశారు. గోనె సంచులను, రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వోలు శ్రీను, విష్ణు, ప్రసాద్, రవి ఉన్నారు.

కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మె

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ వైద్యుల అసోసియేషన్ ఆదేశాల మేరకు జూనియర్ వైద్యుల సమ్మె 3వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల హక్కులు భవిష్యత్‌ను నష్టపరిచేలా విడుదల చేసిన జీవోను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర యూనియన్ సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి విదితమే. దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు పీహెచ్‌సీ, గోపన్నపాలెం పీహెచ్‌సీలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు అత్యవసర వైద్యసేవలు యథావిధిగా చేస్తున్నారు. సమ్మె నోటీసు ప్రకారం సాధారణ వైద్యసేవలు నిలుపుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల హక్కులు, భవిష్యత్‌ను కాలరాసే విధంగా ఇచ్చిన జీవోను ఉపసంహరించుకునే వరకు యూనియన్ నుంచి వచ్చిన షెడ్యూల్ కొనసాగుతుందని యూనియన్ నాయకులు తెలిపారు.

దేశ సమగ్రాభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యం

భీమడోలు: దేశ సమగ్రాభివృద్ధి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వల్లే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. పీఎం నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని మంగళవారం మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో భీమడోలు, వడ్లపట్ల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌లను కట్ చేశారు. వడ్లపట్లలో మండల ప్రధాన కార్యదర్శి వర్దనేడి కపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి తదితరులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ సభ్యుల పదవులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్న ఇద్దరు పురుష, ఒకరు మహిళా సభ్యురాలు ఇటీవల రాజీనామా చేయడంతో, వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎ.భాను ప్రతాప్ ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు నగరపాలక సంస్థ పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలని తెలిపారు. గతంలో చైర్‌పర్సన్ / మేయర్ / వైస్ చైర్ పర్సన్ /డిప్యూటీ మేయర్ / సభ్యుడిగా ఐదు సంవత్సరాలు తక్కువ కాకుండా పదవీ కాలం పూర్తి చేసిన అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో గెజిటెడ్ హోదాలో పదవీ విరమణ చేసి పురపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయ పనివేళల్లో దారఖాస్తు చేసుకోవాలని కోరారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

గణపవరం: ఇటీవలి వరదల కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో గణపవరం కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తరఫున రూ.60వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ తరపున రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే ధర్మరాజుకు అందజేశారు. మరో రూ. పదివేల చెక్కును జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌కు అందజేసినట్లు గణపవరం ఏరియా అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్బరాజు తెలిపారు.

సీఎస్‌టీఎస్‌లో ఓజోన్ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఓజోన్ డేని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఓజోన్ క్షీణతకు కారణమైన క్లోరో ఫ్లోరో కార్బన్స్ గురించి, వాటి వాడకం తగ్గిస్తే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్, రసాయన శాస్త్ర అధ్యాపకుడు ఎం మధు, ఎన్‌ఎస్ఎస్-1, -2 కోఆర్డినేటర్లు నిట్టా వినయ్, గల్లా శ్రీనివాసరావులు మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పరిరక్షణ అందరి బాధ్యత

దెందులూరు: గ్రామ శివారు ప్రాంతాల్లో గ్రామస్వచ్ఛత- పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా దెందులూరులో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ డబ్బాలను అందజేశారు. గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పోతునూరులో సర్పంచ్ బొదుల స్వరూప్, పెరుగ్గూడెంలో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, సీతంపేటలో సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత కనకరాజు, శ్రీరామవరంలో సర్పంచ్ కామిరెడ్డి నాని, గ్రామ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, ఉద్యోగులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

గణపవరం: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అన్నారు. మంగళవారం గణపవరం మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామాల్లో మానవహారంగా ఏర్పడి పారిశుద్ధ్య ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకూ కొనసాగుతాయని గణపవరం ఎంపీడీవో తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీహాసేవ ర్యాలీలు

పెదపాడు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామాల్లో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: గాంధీజీ కలలు కన్నా స్వచ్ఛభారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలనులో మంగళవారం జెడ్పీ సీఈవో కె.సుబ్బారావుతో కలిసి ఆయన స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్తులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. వారంతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేశారు. గ్రామాల స్వచ్ఛతకు పాటు పడుతున్న పారిశుధ్య కార్మికులను, గ్రీన్ అంబాసిడర్‌లను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కూర్మా లక్ష్మీ అధ్యక్షత వహించారు.అనంతరం మొక్కలు నాటారు. చెట్టున్నపాడులో ఎమ్మెల్యే స్థానిక పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ బి.రమాదేవి, మండల జనసేన అధ్యక్షుడు పత్తి మదన్, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించిన బాలురకు ఆర్థిక సాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వివిధ ప్రమాదాల్లో గాయపడి ఏలూరులోని ప్రభ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించగా, అవి వికటించి బాలల భవిష్యత్ ప్రశ్నార్థకం కావడంతో వారికి ఆసుపత్రి యాజమాన్యం నుంచి చెరో రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారంగా అందజేశారు. పెదవేగి మండలం వేగివాడకి చెందిన చలమాల నాగరాజు కుమారుడు జగదీష్ (12) సుమారు మూడేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడగా ఏలూరులోని ప్రభ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. సూర్యారావుపేటకు చెందిన వ్యవసాయ కూలి మాగంటి వెంకటేశ్వరరావు కుమారుడు పూర్ణ (14) బైక్ ప్రమాదంలో గాయపడగా అతనికి కూడా గతంలో ఇదే ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేశారు. వైద్యం వికటించి బాలురు ఇద్దరూ ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. బాలల భవిషత్తు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా, ఆస్పత్రి యాజమాన్యం వారికి పరిహారం అందించేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని దెందులూరు ఎమ్మెల్యే సీహెచ్ ప్రభాకర్ మంగళవారం జెడ్పీ గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహించారు. బాలలకు అందించే మెరుగైన చికిత్స నిమిత్తం కూడా వారికి చెరో రూ.లక్ష చొప్పున ఇస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చారని తెలిపారు.

జీవ రక్షణకు ఆధారం ఓజోన్ పొర

ఉంగుటూరు: అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల వర్చువల్ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఓజోన్ పొరపై రసాయన శాస్త్ర అధ్యాపకురాలు జి.హెబ్సిబా అవగాహన కల్పించారు. ఓజోన్ పొర జీవ రక్షణకు ఆధారమని, కాలుష్యం మూలంగా ఓజోన్ పొరకు విఘాతం కలుగుతోందని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. నారాయణపురం, చేబ్రోలులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.వైస్ ప్రిన్సిపల్ డి.రెడ్డియ్య, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండ రవి, అధ్యాపకులు జి.రాజు, ఆయేషా పాల్గొన్నారు.

వావిలాలకు ఘన నివాళి

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధులు దివంగత వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి కార్యక్రమం మంగళవారం కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్లో నిర్వహించారు. వావిలాల చిత్రపటం వద్ద విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ వావిలాల ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు.

మండలస్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

దెందులూరు: దెందులూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ విజేతల ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ కొవ్వలి ఉన్నత పాఠశాలలో వివరాలు వెల్లడించారు. అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగులో టి.గణేష్ (మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల) ప్రథమ స్థానం, కె.వెంకటేష్ (దెందులూరు ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం కె.మనోహర్ (మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల), లాంగ్ జంప్‌లో టి.గణేష్ (మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల), హైజంప్‌లో ఎం. మనోహర్ (మేధినరావుపాలెం) ప్రథమస్థానంలో నిలిచారు. షార్ట్‌పుట్‌లో ఎస్. రాజు (కొవ్వలి ఉన్నత పాఠశాల) ప్రథమ, వై.అద్భుతకుమార్ (పోతునూరు ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానంలో నిలిచారు.అథ్లెటిక్స్ బాలికలు 100 మీటర్ల పరుగులో ఎం.శ్రీవల్లి (మేధినరావుపాలెం) ప్రథమ స్థానంలో నిలిచింది. 200 మీటర్లల్లో పి.భువనేశ్వరి (మేధినరావుపాలెం) ప్రథమ స్థానంలో నిలిచింది. లాంగ్‌జంప్‌లో వై.నవ్యశ్రీ (మేధినరావుపాలెం) ప్రథమ, భాగ్యశ్రీ (కొవ్వలి) ద్వితీయ స్థానంలో నిలిచింది. హైజంప్‌లో వై.నవ్యశ్రీ (మేధినరావుపాలెం) ప్రథమ, షార్ట్‌పుట్‌లో వి.నిహారిక (కొవ్వలి) ప్రథమ స్థానంలో నిలిచింది.

అథ్లెటిక్స్‌లో బాలుర విభాగంలో విజేతలు: బాలుర విభాగంలో వి.సాయిచంద్ (మేధినరావుపాలెం) ప్రథమ, కె.ధనుష్ (మేధినరావుపాలెం) ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగులో పి.చరణ్‌తేజ్ (మేధినరావుపాలెం) ప్రథమ స్థానానికి ఎంపికయ్యారు. లాంగ్‌జంప్‌లో వి.సాయిచంద్ (మేధినరావుపాలెం) ప్రథమస్థానం సాధించారు. హైజంప్‌లో కె.ధనుష్ (మేధినరావుపాలెం) ప్రథమస్థానం, షార్ట్‌పుట్‌లో వీవీ సాయిచంద్ (మేధినరావుపాలెం) ప్రథమ, ఎం.వీరనాగార్జున (మేధినరావుపాలెం) ద్వితీయ స్థానంలో నిలిచారు.

అథ్లెటిక్స్ బాలికల విభాగం: 100 మీటర్ల పరుగులో జి.ఏసమ్మ (కొవ్వలి) ప్రథమ, కె.పావని (దెందులూరు) ద్వితీయ స్థానంలో నిలిచారు. షార్ట్‌పుట్‌లో జి.దీపిక (పోతునూరు) ప్రథమ, డి.లాస్య (పోతునూరు) ద్వితీయ స్థానంలో నిలిచారు. నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలు ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేది త్వరలో మండలంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు, ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తామని మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ తెలిపారు.

అక్టోబర్ 4 నుంచి ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

దెందులూరు: ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలు జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక ఈనెల 24న ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు అండర్-10, 12, 14, 16, 18, 20 భాగాల్లో బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 100 చెల్లించాలన్నారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డు, పుట్టినతేదీ ధ్రువపత్రం, 10వ తరగతి మార్కుల జాబితా కావాలన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయ వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. యనమదల రామస్వామి సత్రంలో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన కనుమూరి సత్యన్నారాయణ రాజు ఆర్థిక సాయం అందించారు. తొలుత అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

ఉంగుటూరు: బొమ్మిడి - 1పాఠశాలకు దాతలు సహకారం అందించినట్లు హెచ్‌ఎం బొమ్మిడి ప్రసాద్ తెలిపారు. ఉంగుటూరు మండలం బొమ్మిడి - 1 పాఠశాల విద్యార్థులు 30 మందికి దాత తంగేళ్ల నాగేశ్వరరావు సహకారంతో ఐడీ కార్డులు అందజేసినట్లు తెలిపారు. దాత నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

వైభవంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



భీమడోలులో హోమ పూజలు చేస్తున్న అర్చకులు, పెద్దలు

భీమడోలు: విశ్వ నిర్మాత విశ్వకర్మ అని వేదాలు గోచరిస్తున్నాయని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం పెద్దలు అన్నారు. భీమడోలులో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని వైభవంగా నిర్వహించారు. తొలుత విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విశేష పూజలు చేశారు. అర్చకులు వింజువరపు సతీష్, ధనుంజయచారి సంయుక్త ఆధ్వర్యంలో పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన విశ్వబ్రాహ్మణులంతా అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చల్లగాలి వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు గాళ్ల సీతారామచంద్ర రాజారావు, ప్రముఖ వైద్యులు బెనర్జీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, సంఘం పెద్దలు కంచారపు తిరుమల, సంగయ్యాచారి, ముల్లేటి అప్పలాచారి, యర్రంశెట్టి ఏడుకొండలు, తాతోళ్ల వీరబ్రహ్మం పాల్గొన్నారు.

విశ్వకర్మకు భక్తిశ్రద్ధలతో పూజలు

ఉంగుటూరు: విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు అన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతి నారాయణపురం, ఉంగుటూరులో నిర్వహించారు. నారాయణపురంలో బండారు నాగరాజు ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వీరాచారి, లావేటి శ్రీనివాసరావు, కృష్ణ పాల్గొన్నారు. ఉంగుటూరులో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అనుపోజు వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కర్యదర్శి నెల్లూరి రాంపండు, వర్కింగు ప్రెసిడెంటు నిడదవోలు శ్యామ్, యువత అధ్యక్షుడు నిడదవోలు సత్యరవితేజ, వానపల్లి వీర్రాజు వి. విశ్వేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని బాట గంగానమ్మ లేఅవుట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా వ్యాన్‌లో సుమారు 340 కేజీల పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వక్కలగడ్డ అరవింద్‌కుమార్, పంపన సైదుబాబు, కోంద్రు కాశి ఫలనికుమార్ అలియాస్ ఫణిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యువకుడిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో ఒక యువకుడిపై మరికొందరు దాడి చేశారు. ఈనెల 16 రాత్రి రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు కన్నయ్య పార్కు వద్దకు వచ్చేసరికి ఊరేగింపులో పాల్గొన్న తూర్పువీధికి చెందిన పి.రాజశేఖర్ అనే యువకుడి పై అదే ఊరేగింపులో పాల్గొన్న వాసు, ప్రవీణ్, విక్కీ అనే యువకులు ఘర్షణకు దిగారు. అక్కడ నుంచి అతను వెళ్లిపోగా మరోసారి గొడవ రాజీ చేసుకుందాం రమ్మని పిలిచి తేజ, వాసు, విక్కీ, ప్రవీణ్, సాయి అనే మరికొందరు రాజశేఖర్ అనే యువకుడిని కర్రలతో కొట్టి చంపుతామంటూ బెదిరించారు. గాయాలవడంతో బాధితుడిని 108 లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

నులిపురుగుల నివారణతో పరిపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: నులిపురుగుల నివారణ ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని పలువురు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గుండుగొలను, పూళ్ల పీహెచ్ పరిధిల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 19 ఏళ్ల లోపు బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు దగ్గరుండి మధ్యాహ్నం భోజనం తరువాత విద్యార్థులకు మాత్రలు వేశారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో 10,881 మంది బాలబాలికల్లో 10,646 మందికి మాత్రలు వేశారు. పూళ్ల పీహెచ్‌సీలో 4,038 బాలబాలికల్లో 3,913 మంది మాత్రలు వేసుకున్నారు. మిగిలిన వారికి ఈనెల 25న మాత్రలను పంపిణీ చేస్తామని వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమాల్లో సీహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్, టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

దెందులూరు: ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంపూర్ణ పరిరక్షణలో భాగంగా అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులత అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు



భీమడోలులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్



గణపవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

జి.శర్మ ఆధ్వర్యంలో జేఎస్ఎం సరిత, ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ విద్యార్థులకు బ్రోచర్లను అందజేశారు.

ఆరోగ్యానికి ఒక అల్బెంబెండజోల్

గణపవరం: ఆరు నెలలకోసారి ఒక అల్బెండజోల్ మాత్ర వేసుకుంటే ఆరోగ్యం మన సొంతమవుతుందని, అన్ని అనారోగ్య సమస్యలకు మూలం నులి పురుగులేనని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతోపాటు బయట ఉన్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. రక్త హీనత సమస్యకు ప్రధాన కారణమైన నులిపురుగుల నివారణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. గణపవరం మండలంలో మొత్తం 5,900 మంది 19 ఏళ్ల లోపు యువకులకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాల్సి ఉండగా మంగళవారం 5,500 మందికి 97 శాతం మాత్రలు వేశామన్నారు. మిగిలిన వారికి బుధవారం ఇంటింటికీ వెళ్లి మాత్రలు వేస్తారన్నారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం

పెదపాడు: పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి ఆరోగ్యసిబ్బందికి సూచించారు. పెదపాడు మండలంలోని వట్లూరులో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టరు నరేంద్ర కృష్ణ తొలుత నులిపురుగుల మాత్రలను వేసుకుని అనంతరం విద్యార్థులకు అందించారు. డాక్టరు భారతి, ఏసీడీపీఓ రాజశేఖర్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.